www.aksharamedassu.com

APTEL/26/A8343

తెలుగుపత్రిక

అక్షర మేధస్సు

అక్షరమే ఆయుధం మేధస్సే మా మార్గం



ప్రచురణ : అనంతపురం సత్యసాయి | ఎడిటర్ : యన్ రంగనాథ్ | సంపుటి : 01 | సంచిక : 25 | పేజీలు : 04 | శనివారం 14 - 11 - 2026 | వెల : 01/-

భారత్ సమిట్ లక్ష్యం తెలంగాణకు
పెట్టుబడులు ఆహ్వానించడమే

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- తెలంగాణకు పెట్టుబడులు ఆహ్వానించడమే భారత్ సమిట్ లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు
- భారత్ సమిట్‌ను విపక్షాలు గుడ్డిగా వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు
- భారత్ సమిట్‌పై మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ :

తెలంగాణ ప్రత్యేకతలు, అనుకూలతలను ప్రపంచానికి చాటేందుకు భారత్ సమిట్ నిర్వహిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. గ్లోబల్ సమిట్ కంటే ముందు భారత్ సమిట్ నిర్వహించినట్లు తెలిపారు. బెంగళూరు, చెన్నై, దిల్లీలో సన్నాహక కార్యక్రమం నిర్వహించామని గుర్తుచేశారు. త్వరలో ముంబయి, అహ్మదాబాద్‌లోనూ సన్నాహక కార్యక్రమాలు ఉంటాయన్నారు. సమిట్‌కు దాదాపు 70 దేశాల నుంచి 1000 మంది ప్రతినిధులు వచ్చారని ముఖ్యమంత్రి వెల్లడించారు. కొంతమంది ప్రతినిధులను చివరి నిమిషంలో బీజేపీ ప్రభుత్వం అడ్డుకుందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొందరు ఎయిర్‌పోర్టుకు వచ్చాక కూడా వెనక్కి వెళ్లాల్సి వచ్చిందన్నారు.తెలంగాణకు పెట్టుబడులు ఆహ్వానించడమే భారత్ సమిట్ లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వాతావరణ మార్పులు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులపై సమిట్‌లో చర్చిస్తున్నామని వివరించారు. తెలంగాణ, హైదరాబాద్‌ను చూపించడం ద్వారా నమ్మకం కలిగించాలని ప్రయత్నిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. భారత్ సమిట్‌పై కిషన్‌రెడ్డి, రాంచందర్‌రావు, కేసీఆర్‌కు ఎందుకు కోపమో అర్థం కావట్లేదని సీఎం అన్నారు. భారత్ సమిట్‌ను విపక్షాలు గుడ్డిగా వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు.“ప్రజా ప్రయోజన కార్యక్రమాలు చేపట్టినా వ్యతిరేకిస్తున్నారు. మోదీ ఏది చేసినా కరెక్టే, రాహుల్‌గాంధీ ఏది చేసినా తప్పు అనేలా వ్యవహరిస్తున్నారు. - మిగతా 2 లో

రాష్ట్ర ఆదాయం
హైదరాబాద్ నుంచే 40 శాతం



- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్
- హైదరాబాద్ వేదికగా ప్రారంభమైన భారత్ సమ్మిట్ 2026
- అభివృద్ధి కేంద్రీకృతం కావడం తీవ్ర అసమతుల్యతకు నిదర్శనమన్న మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్ :

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందే సమాన అభివృద్ధి, ఉపాధి అవకాశాల కోసమని, కానీ ప్రస్తుతం రాష్ట్ర ఆదాయంలో సుమారు 40 శాతం కేవలం హైదరాబాద్ నగరం నుంచే వస్తుండటం తీవ్రమైన అసమతుల్యతకు నిదర్శనమని టీపీసీసీ - మిగతా 2 లో



నీటి మళ్లింపుపై
విచారణ జరపాలి

- బీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత డిమాండ్
- ఫామ్‌హౌస్‌కు కెనాల్ ఉందా? లేదా? అనే అంశంపై బీఆర్ఎస్ స్పష్టతనివ్వాలన్న కవిత
- గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతితో తనకు ఎలాంటి సంబంధం లేదని వ్యాఖ్య
- సిద్ధిపేటలో టీఆర్ఎస్ కార్యాలయానికి భూమిపూజ చేసిన కవిత దంపతులు

హైదరాబాద్ :

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి మళ్లింపు వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరపాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఈరోజు సిద్ధిపేట - మిగతా 2 లో



2 లో..

ఎల్‌నినోతో హెల్త్ ఎమర్జెన్సీ
భారత్‌కు డబ్ల్యూహెచ్ఓ హెచ్చరిక

- ఎల్‌నినో ప్రభావంతో ఆరోగ్య ముప్పులు పెరిగే అవకాశముందన్న డబ్ల్యూహెచ్ఓ
- అత్యున్నత స్థాయి అత్యవసర స్పందనను ప్రారంభించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ
- భారత్‌ను హైరిస్క్ దేశంగా గుర్తించి అప్రమత్తం చేసిన వైనం
- వడగాలులు, డెంగీ, మలేరియా, నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు, పోషకాహార లోపం ప్రధాన ప్రమాదాలు
- ముందస్తు హెచ్చరికలు, వైద్య సన్నద్ధత, తాగునీటి భద్రతను బలోపేతం చేయాలని సూచన

భారత్‌లో సైన్స్, ఆధ్యాత్మికత
ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి



- ప్రధాని నరేంద్ర మోదీ
- కర్ణాటక మైసూర్ యూనివర్సిటీ ప్రాంగణంలో దేశంలోనే తొలి డోమ్ ప్లానిటోరియాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు
- 100 కిలోమీటర్ల క్లబ్‌లో చేరిన బెంగళూరు మెట్రో

ఢిల్లీ :

భారతదేశంలో సైన్స్ (విజ్ఞానం), ఆధ్యాత్మికత ఒకదానితో ఒకటి కలిసికట్టుగా ముందుకు సాగుతాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. నేటి భారతీయ యువత ఖగోళ శాస్త్రం (ఆస్ట్రోఫిజిక్స్), సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో అద్భుతమైన ప్రగతి సాధిస్తోందని కొనియాడారు. చాముండి కొండల దిగువన ఉన్న మైసూరు యూనివర్సిటీ క్యాంపస్‌లో భారతదేశంలోనే మొట్టమొదటి ఎల్ఈడీ డోమ్ ప్లానిటోరియం కాస్మోస్- మైసూరును ప్రారంభించిన మోదీ అనంతరం ప్రసంగించారు. ఈ క్రమంలోనే దేశంలో విజ్ఞాన శాస్త్రాన్ని ప్రోత్సహించడానికి మైసూరు రాజకుటుంబం - మిగతా 2 లో

సీఎం చంద్రబాబుపై
మండిపడ్డ వైఎస్ షర్మిల



- రాష్ట్రంలో ఫీజు బకాయిలు రూ.6,400 కోట్లు దాటాయన్న షర్మిల
- అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో క్లియర్ చేస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్న
- ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్

అమరావతి :

ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశంపై కూటమి ప్రభుత్వంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. - మిగతా 2 లో



కొండెక్కిన
కోడిగుడ్డు ధర

- గత మూడు నెలలుగా స్థిరంగా ఉండి మళ్లీ పెరిగిన గుడ్డు ధర
- హోల్‌సేల్ మార్కెట్లో డజన్ గుడ్ల ధర రూ.80 నుంచిరూ.96కు చేరిక
- స్వల్ప వ్యవధిలోనే డజన్‌పై ఏకంగా రూ.16 పెరిగిన వైనం

హైదరాబాద్ :

తెలుగు రాష్ట్రాల్లో సామాన్యుడికి కోడిగుడ్డు ధర షాక్ ఇస్తోంది. దాదాపు మూడు నెలల పాటు నిలకడగా ఉన్న గుడ్ల ధరలు - మిగతా 2 లో

అసోం రోడ్డు ప్రమాదంలో
23 మంది దుర్మరణం

- అసోంలోని కజిరంగా సమీపంలో రోడ్డు ప్రమాదం
- మినీ బస్సును ఎదురుగా వచ్చి బలంగా ఢీకొట్టిన కంటైనర్ లారీ
- ఘటనలో 23 మంది దుర్మరణం పలువురికి తీవ్ర గాయాలు
- మృతుల్లో ఎక్కువ మంది పాఠశాల కాలేజీ విద్యార్థులు
- బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అసోం సీఎం ఆదేశం

2 లో..

పెట్టుబడులే కాదు ప్రాజెక్టులు
వేగంగా పట్టాలెక్కుతున్నాయి

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- పరిశ్రమల ఏర్పాటుకు వేగంగా అనుమతులిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు
- అవసరమైన సహకారం అందిస్తామని పారిశ్రామికవేత్తలకు సీఎం భరోసానిచ్చారు
- విశాఖ భాగస్వామ్య సదస్సు వేదికగా కీలక సమావేశాలు నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి :

“పారిశ్రామికవేత్తలకు ఒక్క ఫోన్ కాల్ దూరంలో ఉంటాం, పరిశ్రమల ఏర్పాటుకు వేగంగా అనుమతులిస్తాం. అవసరమైన సహకారం అందిస్తాం”. ఇదీ పెట్టుబడిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన భరోసా. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా ఏపీ ముందుకు సాగుతోందని సీఎం పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో పెట్టుబడుల ప్రకటనలే కాదు. ప్రాజెక్టులు కూడా వేగంగా పట్టాలెక్కుతున్నాయని స్పష్టం చేశారు.రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించేందుకు విశాఖ భాగస్వామ్య సదస్సు వేదికగా సీఎం చంద్రబాబు పలు కీలక సమావేశాలు నిర్వహించారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో రూ.1,750 కోట్లతో ఫ్లోట్ గ్లాస్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు సెయింట్ గోబెన్ ముందుకొచ్చింది. ఈ ప్లాంట్ ద్వారా 400 మందికి ఉద్యోగాలు కల్పించనున్నారు. సంస్థ సీఈవో శ్రీధర్ ముఖ్యమంత్రితో సమావేశమై ఈ వివరాలు వెల్లడించారు.ఇప్పటికే తడ, విశాఖ, కావలిలో తయారీ యూనిట్లు ఉన్నాయని తెలిపారు. ప్లాస్టర్ బోర్డ్, జిప్సమ్ సిస్టమ్స్, ఇన్సులేషన్ రంగాల్లోనూ పెట్టుబడులకు ప్రణాళికలు ఉన్నాయని వివరించారు. విశాఖలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని, ఐఐటీ తిరుపతితో కలిసి నిర్మాణ రంగ ఉత్పత్తుల పరిశోధనలకు ఏపీని కేంద్రంగా ఎంచుకోవాలని చంద్రబాబు సూచించారు. అమరావతి నిర్మాణంలోనూ భాగస్వామి కావాలని ఆహ్వానించారు. తెనాలిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు శ్రీధర్ - మిగతా 2 లో

ఏకగ్రీవ పంచాయతీలకు
కాసుల వర్షం

- కనిష్ఠంగా రూ.15 లక్షలు, గరిష్ఠంగా రూ.50 లక్షలు
- రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ప్రోత్సాహకాలు
- జనాభా ప్రాతిపదికన మూడు కేటగిరీలుగా నగదు బహుమతులు
- 5 వేలలోపు జనాభా ఉంటే రూ.15 లక్షలు
- 5,001 నుంచి 10 వేల జనాభా ఉంటే రూ.25 లక్షలు
- 10 వేలకు పైగా జనాభా ఉంటే రూ.50 లక్షలు
- పంచాయతీ ఎన్నికల వేళ శాంతిభద్రతల సమస్యల నివారణే లక్ష్యం



అమరావతి :

రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల జోరు కొనసాగుతుంది. ఏకగ్రీవాల కోసం అధికారులు వేచిచూస్తున్నారు. పంచాయతీల్లో ఏకగ్రీవాలు జరిగేలా భారీ ప్రయత్నాలే జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సైతం ప్రోత్సాహకాలు పెంచడం ద్వారా ఆకట్టుకుంది. రాష్ట్రంలో తొలిదశ పంచాయతీ ఎన్నికలకు నేడు (శుక్రవారం) నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఏకగ్రీవ పంచాయతీలకు అందించే ప్రోత్సాహకాలను ప్రభుత్వం భారీగా పెంచింది. కనిష్ఠంగా రూ.15 లక్షలు, గరిష్ఠంగా రూ.50 లక్షలు అందించనున్నట్లు పేర్కొంది. ఇప్పటివరకూ ఉన్న నాలుగు కేటగిరీలను 3కు కుదించింది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థికశాఖ - మిగతా 2 లో

సంపాదకీయం

సాధ్యమేనా..?

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్‌హసీనా స్వదేశంలో కాలుమోపే సాహసోపేతమైన నిర్ణయం ఇప్పుడు ఉభయదేశాల మధ్యా మళ్ళీ అగ్గిరాజేసింది. నేను వస్తున్నాను, వెంటనే పాస్‌పోర్టు, గుర్తింపుకార్డు ఇవ్వండి అంటూ బంగ్లాదేశ్ ప్రభుత్వానికి ఆమె పెట్టుకున్న దరఖాస్తును, టెర్రరిస్టులకు, నేరస్తులకు అటువంటివి ఇవ్వరు అంటూ అక్కడి ప్రభుత్వం తిరస్కరించింది. విదేశాంగమంత్రి హుమాయూన్ కబీర్ దీనిని డ్రామా అంటూ తీసిపారేశారు. ఆమె నిజంగా బంగ్లాదేశ్ రావాలనుకుంటే ఒకే దారి ఉన్నదంటూ, భారత్--బంగ్లాదేశ్ మధ్య ఉన్న నేరస్తుల అప్పగింత ఒప్పందాన్ని గుర్తుచేశారు. తనను అప్పగించవలసిందిగా భారత్‌ను కోరి, ఆ మార్గంలో బంగ్లాదేశ్ వచ్చి, కోర్టుకు లొంగిపోయి శిక్ష అనుభవించాలన్నారు ఆయన. రెండేళ్ళక్రితం విద్యార్థి ఉద్యమాన్ని అణిచివేసి, అనేకమంది ప్రాణాలు కోల్పోవడానికి కారకురాలంటూ అక్కడి కోర్టు ఆమెకు ఉరిశిక్ష విధించింది కనుక, వస్తే ఉరితప్పదని అక్కడి చీఫ్ ప్రాసిక్యూటర్ కూడా మరోమారు గుర్తుచేశారు. తనను అరెస్టు చేస్తారని, ఉరితీస్తారని తెలిసికూడా డిసెంబరులో తాను బంగ్లాలో కాలూనడం ఖాయమని, ప్రజలకోసం తాను ప్రాణత్యాగానికి కూడా వెరవనని హసీనా చాలాసార్లు ప్రకటించారు. ఇప్పుడు మళ్ళీ ఆమె రాకతో ముడిపడి అక్కడ హింస రేగింది, ఆమె పార్టీ దాడులకు తెగబడుతూ తమను భయపెట్టేందుకు ప్రయత్నిస్తోందని అక్కడి ప్రభుత్వం ఆరోపణలు చేస్తోంది.ఇలాంటి ప్రయాణాలకు ట్రావెల్ డాక్యుమెంట్ తప్పనిసరి కదా అన్నది భారత్ స్పందన. స్వదేశానికి తిరిగివచ్చే ఆమె హక్కును బంగ్లాదేశ్ ఎలా కాదంటుంది? అన్న ప్రశ్నకు బంగ్లాదేశ్ హైకమిషన్ మరింత చక్కగా సమాధానం చెబుతుందని, అప్పగింత గురించి తాము కొత్తగా మాట్లాడేదేమీ ఉండబోదని భారత విదేశాంగశాఖ ప్రతినిధి వ్యాఖ్యల సారాంశం. భారత్ అప్పగించదు, బంగ్లాదేశ్ ఆహ్వానించదు కనుక ఈ సంక్లిష్ట పరిణామాల నేపథ్యంలో ఆమె డిసెంబరులో బంగ్లాదేశ్‌లో అడుగుపెట్టడం జరిగేపని కాదని కొందరి నమ్మకం. అయితే, హసీనా అదేపనిగా వచ్చేనెల వెళ్ళడం ఖాయమని అంటున్నారు కనుక, అనధికారికంగా సరిహద్దులు దాటిపోవడానికి సైతం సిద్ధపడతారా? అని కొందరి అనుమానం. బంగ్లాదేశ్‌లో అవామీలీగ్ కూడా ఆరునూరైనా డిసెంబరులో ఆమె రాక ఖాయమని ఉద్ఘాటంగా ప్రచారం చేసుకుంటోంది.లండన్‌లోని మాట్రిక్స్ చాంబర్స్ ద్వారా భారత్‌లోని బంగ్లాదేశ్ హైకమిషన్‌కు పాస్‌పోర్టుకోసం అభ్యర్థించడంతో 26 నెలల తరువాత హసీనా అధికారికంగా తన ప్రభుత్వంతో సంప్రదింపులు ఆరంభించినట్టయింది. భారత్ చేరిన ఏడాదిపాటు ఆమె దాదాపు నిశ్శబ్దంగానే ఉన్నారు. క్రమంగా సామాజిక మాధ్యమాల ద్వారా తన ఉనికిని చాటుకుంటూ, మరుసటి ఏడాది విలేకరుల సమావేశాలను ఏర్పాటుచేయడం వరకూ వచ్చి బంగ్లాదేశ్ మీద ఒత్తిడి పెంచారు. తన గత హోదాలతో సంబంధం లేకుండా కేవలం పాస్‌పోర్టు, పౌరసత్వ గుర్తింపుకార్డు అడిగితే కూడా బంగ్లాదేశ్ తిరస్కరించడం, తన పార్టీని పునరుద్ధరించుకొనే హక్కును ఆమెకు దక్కనివ్వకపోవడం ప్రపంచం గుర్తించింది. ఆరుగురు బ్రిటిష్ ఎంపీలు ఆమె పక్షాన ముందుకు రావడం బంగ్లా ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టే పరిణామం. రెండేళ్ళక్రితం బంగ్లాలో రాజకీయ సంక్షోభం, ఆగస్టులో హసీనా భారత్ రాక ఉభయదేశాల సంబంధాలను తీవ్రంగా దెబ్బతీశాయి. ఆమె ప్రబలశత్రువు, బంగ్లా ప్రధాని తారీఖ్ రహ్మాన్ దేశాలన్నీ తిరుగుతున్నారు కానీ, ఢిల్లీలో మాత్రం కాలూనడంలేదు. రహ్మాన్ పర్యటనను హసీనా అప్పగింతతో ముడిపెట్టి, అది జరిగిన తరవాతే పర్యటన ఉంటుందని బంగ్లాదేశ్ ఒత్తిడి తెస్తున్నట్టు వార్తలు వింటున్నాం. రహ్మాన్ వచ్చి, భారత ప్రధానితో ఈ విషయంపై చర్చించివుంటే, ఈ అంశం ఇంత సంక్లిష్టంగా మారేదికాదేమో. ఉభయ దేశాలు ఈపాటికే ఏదో ఒక మార్గాన్ని కనిపెట్టగలిగేవి. రహ్మాన్‌తో సయోధ్యకు భారత్ తనవంతుగా చేసిన ప్రయత్నాలు కూడా తక్కువేమీ కాదు. అయినప్పటికీ, పలు కారణాలరీత్యా హసీనా పేరిట భారత్‌తో ఏ మాత్రం సానుకూలంగా వ్యవహరించకూడదని అక్కడి ప్రభుత్వం నిర్ణయించుకున్నట్టుంది. కనీసంగా ఉండాల్సిన సుహృద్భావం కూడా లోపించిన కారణంగా అన్ని రంగాలపైనా దాని దుష్ప్రభావం పడింది. ద్వైపాక్షిక వాణిజ్యం పెద్దగా తగ్గకపోయినా, పరస్పరం విధించుకున్న వాణిజ్య ఆంక్షలతో దూరం పెరిగింది. గంగానదీ జలాల ఒప్పందాన్ని సైతం ఈ విభేదాలు ప్రభావితం చేస్తున్నాయి. దేశాన్ని వీడి రెండేళ్ళయిన సందర్భంలో ఆగస్టు 5న ఆమె చేసిన ప్రసంగం బంగ్లా పాలకులతో సంబంధాలను సంక్లిష్టం చేసింది. డిసెంబరులో ఆమె భారత్‌ను వీడుతారా, అది ఎలా జరుగుతుందన్నది అటుంచితే, రాబోయే రెండునెలల కాలం ఉభయ దేశాలకు విషమ పరీక్షే.



పెట్టుబడులే కాదు ప్రాజెక్టులు వేగంగా పట్టాలెక్కుతున్నాయి

వెల్లడించారు. పెట్టుబడుల రక్షణ చట్టం పారిశ్రామికవేత్తల్లో విశ్వాసం పెంచిందని ప్రశంసించారు.దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ జాంటీ రోడ్స్ సీఎంతో భేటీ అయ్యారు. ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న ఆయన భోగాపురం విమానాశ్రయం సమీపంలో ఏర్పాటు చేస్తున్న ముక్కం కోస్టల్ వెల్‌నెస్, సర్ఫ్ క్లబ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనున్నారు. రూ.55 కోట్ల పెట్టుబడితో ముక్కం బీచ్‌లో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. సీఎం చంద్రబాబుతో గ్రూప్ ఎండీ శాశ్వత్ గొయెంకా భేటీ అయ్యారు. పుర్వా గ్రీన్ పవర్ ద్వారా రూ.3,286 కోట్ల పెట్టుబడితో 349 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టును ఈ సంస్థ ఏర్పాటు చేస్తోంది. సౌర విద్యుత్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్ రంగాల్లోనూ పెట్టుబడులను పరిశీలించాలని గొయెంకాను సీఎం కోరారు. విజయవాడలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఫస్ట్‌సోర్స్‌ను విశాఖపట్నం, తిరుపతికి విస్తరించాలని పీ4 కార్యక్రమంలో భాగస్వాములు సూచించారు. అమరావతిలో ఖతార్ దేశ కార్యాలయం: భారత్‌లో ఖతార్



రాయబారి మహ్మద్ హసన్ అల్ జబీర్ సీఎం చంద్రబాబుతో సమావేశం అయ్యారు. పోర్టులు, పెట్రో కెమికల్స్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో పెట్టుబడులకు సహకరించాలని ఖతార్ రాయబారిని చంద్రబాబు కోరారు. అమరావతిలో ఖతార్ దేశ కార్యాలయం ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. త్వరలోనే ఖతార్ అధికారిక బృందం ఏపీలో పర్యటిస్తుందని రాయబారి తెలిపారు.ఏపీ అభివృద్ధి ప్రస్థానాన్ని అంతర్జాతీయ వేదికపై చాటిచెప్పేలా విశాఖలో 'టైమ్ ఇంపాక్ట్ డిన్నర్' నిర్వహించారు. 'టైమ్' ఇంటర్నేషనల్ మేనేజింగ్ డైరెక్టర్ డామియన్ దగ్లస్‌తో ముఖాముఖిలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడుల పురోగతిని ప్రపంచానికి పరిచయం చేయాలని చంద్రబాబు కోరారు. చంద్రబాబు నాయకత్వం, రాష్ట్ర అభివృద్ధిని దగ్లస్ ప్రశంసించారు. ఏపీ విజయగాథను, అభివృద్ధి నమూనాను ప్రపంచానికి పరిచయం చేస్తామని తెలిపారు.'బిల్ట్ ద నెక్స్ట్ చాప్టర్ ఆఫ్ గ్రోత్' అంశంపై జరిగిన ప్యానెల్ చర్చలో వరాహ క్యైమేట్‌ఏజీకి చెందిన మధుర్ జైన్, పబ్లిసిస్ గ్రూప్ సీఈవో అనుప్రియ ఆచార్య, ఇసుజు మోటార్స్ ఇండియా ప్రెసిడెంట్ రాజేష్ మిట్టల్, ఆసియా అభివృద్ధి బ్యాంకు ఇండియా రెసిడెంట్ మిషన్ కంట్రీ డైరెక్టర్ మియో ఓకా పాల్గొన్నారు. ప్రపంచ వృద్ధికి దోహదపడే భాగస్వామ్యాలు, భవిష్యత్ పెట్టుబడులు, సుస్థిర అభివృద్ధి అవకాశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

ఎల్‌నినోతో హెల్త్ ఎమర్జెన్సీ.. భారత్‌కు డబ్ల్యూహెచ్ఓ హెచ్చరిక

మొదటిపేజీ తరువాయి - ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వడగాలులు, కరవు, అంటువ్యాధులు, ఆహార కొరత వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) హెచ్చరించింది. ఈ ముప్పును దృష్టిలో ఉంచుకుని అత్యున్నత స్థాయి అత్యవసర స్పందనను ప్రారంభించింది. భారత్‌ను అధిక లేదా అత్యధిక ఆరోగ్య ముప్పు ఎదుర్కొనే దేశాల జాబితాలో చేర్చింది. దక్షిణాసియాలో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు, తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్న నేపథ్యంలో ముందస్తు సన్నద్ధత అవసరమని స్పష్టం చేసింది.నవంబర్ 2న విడుదల చేసిన వ్యూహాత్మక సన్నద్ధత, స్పందన ప్రణాళికలో డబ్ల్యూహెచ్ఓ ఈ విషయాలను వెల్లడించింది. 2026 అక్టోబర్ నుంచి 2027 సెప్టెంబర్ వరకు గ్రేడ్-3 స్థాయి అత్యవసర స్పందన కొనసాగనుంది. ఇది సంస్థలో అత్యున్నత స్థాయి స్పందన. వ్యాధుల గుర్తింపు, పర్యవేక్షణ, నివారణ, వైద్య సేవలు, సమన్వయంపై ప్రధానంగా దృష్టి పెట్టనుంది. తొలి 6 నెలల కార్యకలాపాల కోసం సుమారు 3.5 కోట్ల డాలర్ల నిధులు అవసరమని అంచనా వేసింది. ఎల్‌నినో నేరుగా వ్యాధులకు కారణం కాదని, వాతావరణ పరిస్థితులను మార్చి ఆరోగ్య సమస్యలు పెరిగేలా చేసే ప్రమాద కారకమని డబ్ల్యూహెచ్ఓ వివరించింది.సెప్టెంబర్ 5న విడుదలైన ప్రపంచ ఆరోగ్య పరిస్థితుల అంచనాలో భారత్‌ను అధిక లేదా అత్యధిక ముప్పు ఉన్న దేశంగా గుర్తించింది. బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్, శ్రీలంక, మాల్దీవులకూ ఇదే తరహా ప్రమాదాలున్నాయని పేర్కొంది.

తీవ్ర ఉష్ణోగ్రతలు: వడగాలుల వల్ల డీహైడ్రేషన్, వడదెబ్బ, గుండె, శ్వాసకోశ, మూత్రపిండాల సమస్యలు తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసేవారికి ముప్పు ఎక్కువ.

డెంగీ, మలేరియా: ఉష్ణోగ్రతలు, వర్షపాతంలో మార్పులు దోమల వ్యాప్తిపై ప్రభావం చూపుతాయి. నీటి కొరతతో ఇళ్లలో నిల్వ చేసే నీటి పాత్రలు దోమల పెరుగుదలకు కారణం కావచ్చు. ఈశాన్య భారతంలో మలేరియా ముప్పునూ నివేదిక ప్రస్తావించింది.

నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు: వరదలు, పారిశుద్ధ్య సమస్యల వల్ల తాగునీరు కలుషితమై లెప్టోస్పిరోసిస్ వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది.

ఆహార కొరత, పోషకాహార లోపం: వర్షాలు తగ్గితే పంటల దిగుబడి, వ్యవసాయ ఆధారిత ఉపాధి దెబ్బతింటాయి. ఐదేళ్లలోపు పిల్లలు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార సమస్యలు పెరిగే అవకాశం ఉంది. వైద్య సేవలకు అంతరాయం: తీవ్ర వాతావరణ పరిస్థితులు ఆసుపత్రులు, ఔషధ సరఫరా వ్యవస్థలను ప్రభావితం చేయవచ్చు. మధుమేహం, గుండె, మూత్రపిండాల వ్యాధులతో బాధపడేవారికి చికిత్స అందడంలో ఇబ్బందులు తలెత్తవచ్చు.

భారత వ్యవసాయం, తాగునీటి అవసరాలు రుతుపవనాలపై ఆధారపడి ఉండటంతో వర్షపాతంలో మార్పులు కీలకంగా మారనున్నాయి. 2026 ఆగస్టులో పార్లమెంటుకు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. సీజన్ మొత్తంలో దీర్ఘకాలిక సగటులో 90 శాతం వర్షాలు కురిసే అవకాశముందని, అంచనాలో 4 శాతం వరకు తేడా ఉండవచ్చని పేర్కొంది.అయితే ఎల్‌నినో ఏర్పడితే రుతుపవనాలు పూర్తిగా విఫలమవుతాయని చెప్పలేమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఎల్‌నినో తీవ్రత, ఏర్పడే సమయం వంటి ఇతర వాతావరణ పరిస్థితుల ప్రభావంపైనా వర్షపాతం ఆధారపడి ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో కరవు పరిస్థితులు ఏర్పడితే, మరికొన్ని చోట్ల భారీ వర్షాలు, వరదలు సంభవించవచ్చు.పిల్లలు, గర్భిణులు, వృద్ధులు, వైకల్యాలున్నవారు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలున్నవారు ఎక్కువగా ప్రభావితమయ్యే అవకాశముంది. పట్టణ మురికివాడలు, మారుమూల ప్రాంతాల్లో నివసించేవారికి సురక్షిత తాగునీరు, పారిశుద్ధ్యం, చల్లదనం కల్పించే సదుపాయాలు, వైద్య సేవలు అందుబాటులో లేకపోవడం మరో సమస్య. వ్యవసాయ కూలీలు, నిర్మాణ రంగ కార్మికులు, వీధి వ్యాపారుల వంటి బహిరంగ ప్రదేశాల్లో పనిచేసేవారు వడగాలుల బారిన పడే ప్రమాదం ఉంది. ఉపాధి కోల్పోవడం, ఆహార కొరత, వలసల వంటి పరిణామాలు మానసిక ఆరోగ్యంపైనా ప్రభావం చూపవచ్చని డబ్ల్యూహెచ్ఓ తెలిపింది.వాతావరణ మార్పులు అత్యవసర పరిస్థితులుగా మారకముందే స్పందించాలన్నది డబ్ల్యూహెచ్ఓ ప్రణాళికలోని ప్రధాన ఉద్దేశం. వ్యాధుల పర్యవేక్షణ, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేయాలని సూచించింది. అవసరమైన మందుల నిల్వలు, ఆసుపత్రుల్లో అత్యవసర సేవల కొనసాగింపు, వాతావరణ శాఖలు, ఆరోగ్య విభాగాలు, విపత్తు నిర్వహణ సంస్థల మధ్య సమన్వయం పెంచాలని పేర్కొంది.భారత్‌లో డెంగీ, మలేరియా నివారణ చర్యలు, సురక్షిత తాగునీటి సరఫరా, వడగాలులను ఎదుర్కొనే వైద్య సన్నద్ధతపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఎల్‌నినోతో దేశంలోని ప్రతి ప్రాంతంలో ఆరోగ్య అత్యవసర పరిస్థితి ఏర్పడుతుందని ఈ హెచ్చరిక అర్థం కాదని, స్థానిక వాతావరణ పరిస్థితులు, ముందస్తు సన్నద్ధతను బట్టి ప్రభావం మారుతుందని డబ్ల్యూహెచ్ఓ స్పష్టం చేసింది.

భారత్‌లో సైన్స్, ఆధ్యాత్మికత ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి

మొదటిపేజీ తరువాయి -

చేసిన కృషిని మోదీ ప్రత్యేకంగా అభినందించారు. మైసూర్ విశ్వవిద్యాలయాన్ని స్థాపించడమే కాకుండా, బెంగళూరులోని అత్యంత ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఏర్పాటు కోసం భూమిని దానం చేయడం ద్వారా దేశంలో శాస్త్రీయ అభివృద్ధికి బలమైన పునాది వేశారని గుర్తుచేశారు. అంతరిక్ష రంగంలో భారత్ సాధించిన విజయాల్ని కూడా మోదీ ఈ సందర్భంగా ప్రస్తావించారు. చంద్రయాన్- 3 ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలి దేశంగా భారత్ నిలిచిందని తెలిపారు. గతేడాది భారత వ్యోమగామి శుభాంశు శుక్లాను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపిన విషయాన్ని కూడా గుర్తుచేశారు."భారతదేశంలో ఆధ్యాత్మికత, సైన్స్ ఎప్పుడూ కలిసే నడుస్తాయి. ఆధునిక పరికరాలు ఏవీ అందుబాటులో లేని కాలంలోనే మన పూర్వీకులు విశ్వాన్ని, గ్రహాల కదలికలను ఎంతో నిశితంగా అధ్యయనం చేశారు. విశ్వంలో ఎన్నో రహస్యాలను ఛేదించడానికి మన ఖగోళ శాస్త్రవేత్తలు ఎంతో సంక్లిష్టమైన గణిత లెక్కలను ఎంతో సులభంగా పూర్తి చేశారు.కర్ణాటక పర్యటనలో ఉన్న ప్రధాని భారతదేశంలో శాస్త్ర, సాంకేతిక రంగాలకు పెద్దపీట వేస్తూ శుక్రవారం రోజు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తొలుత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ నిర్మించిన ఎల్ఈడీ డోమ్ ప్లానిటోరియంను ప్రారంభించారు. దీనిని ఖగోళ విజ్ఞానంపై విద్య, పరిశోధన, శిక్షణకు కేంద్రంగా తీర్చిదిద్దారు. ఈ ప్లానిటోరియం ప్రారంభ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు, ప్రజల్లో ఖగోళ శాస్త్రంపై ఆసక్తిని పెంచడానికి ఇది ఒక అద్భుతమైన పరిశోధన, శిక్షణా కేంద్రంగా ఉపయోగపడుతుందని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.సంప్రదాయ ప్లానిటోరియాల మాదిరిగా ఈ మైసూరు కాస్మోస్ ప్లానిటోరియంలో ప్రొజెక్టర్లను ఉపయోగించకుండా వినూత్న సాంకేతికతను వాడారు.15 మీటర్ల వెడల్పు గల వంపు తిరిగిన డోమ్‌పై సుమారు 6150 ప్యానెల్స్‌లో 4.2 కోట్ల వ్యక్తిగత ఎల్ఈడీలను అమర్చారు.వీటిని రియల్ టైమ్‌లో కంట్రోల్ చేయవచ్చు. దీంతో నక్షత్రాలు, గ్రహాలు, విశ్వానికి సంబంధించిన దృశ్యాల్ని మరింత స్పష్టంగా వీక్షించొచ్చు. ఇది సరికొత్త అనుభూతిని కలిగిస్తుంది.ఇదే పర్యటనలో మోదీ- బెంగళూరు నమ్మ మెట్రో పింక్ లైన్‌ను కూడా ప్రారంభించారు. మెట్రో విస్తరణ కేవలం రవాణా ప్రాజెక్ట్ మాత్రమే కాదని, ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించాలనే దేశ లక్ష్యంలో భాగమని వివరించారు. దిల్లీ, ముంబయి మెట్రోపాలిటన్ ప్రాంతం తర్వాత 100 కిలోమీటర్ల మెట్రో నెట్‌వర్క్ కలిగిన మూడో నగరంగా బెంగళూరు నిలిచిందని ప్రధాని చెప్పారు. కొత్త మెట్రో మార్గం వల్ల బెంగళూరులోని విద్యాసంస్థలు, వ్యాపార, సాంకేతిక, వాణిజ్య కేంద్రాలకు కనెక్టివిటీ మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా రైల్వే వ్యవస్థలో వస్తున్న మార్పుల్ని ప్రస్తావించిన మోదీ- వందే భారత్ రైళ్లు, అమృత్ భారత్ స్టేషన్ల ద్వారా వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేసుకుంటున్నామన్నారు. కర్ణాటకలో చామరాజనగర్, చిక్కమగళూరు వంటి 60కిపైగా స్టేషన్లను అమృత్ భారత్ స్టేషన్లుగా మారుస్తున్నట్లు మోదీ వెల్లడించారు.

ఏకగ్రీవ పంచాయతీలకు కాసుల వర్షం

మొదటిపేజీ తరువాయి - నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వం నేడు ఉత్తర్వులు జారీ చేసింది.తాజా నిర్ణయం ప్రకారం ఏకగ్రీవమైన వాటిలో 5 వేలలోపు జనాభా ఉండే పంచాయతీలకు రూ.15 లక్షలు, 5,001 నుంచి 10 వేలలోపు జనాభా గల పంచాయతీలకు రూ.25 లక్షలు, పది వేల కంటే మించిన జనాభా గల పంచాయతీలకు రూ.50 లక్షలు ప్రభుత్వం చెల్లించనుంది. ఏకగ్రీవ పంచాయతీలకు ఇప్పటివరకు 2 వేలలోపు జనాభా ఉండే పంచాయతీలకు రూ.5 లక్షలు, 2,001 నుంచి 5 వేలలోపు జనాభా గల పంచాయతీలకు రూ.10 లక్షలు, 5,001 నుంచి 10 వేల లోపు జనాభా గల పంచాయతీలకు రూ.15 లక్షలు, 10 వేలపైన జనాభాగల పంచాయతీలకు రూ.20 లక్షలు ఇచ్చేవారు.ఇప్పుడు వీటిని సవరించడం ద్వారా గ్రామాల్లో పంచాయతీలకు ఏకగ్రీవాలను ప్రోత్సహించడం ద్వారా ఉద్రిక్తతలను నివారించడం ఒక లక్ష్యంగా ప్రభుత్వం చెబుతోంది. గ్రామాల్లో ఎన్నికలు సందర్భంగా తలెత్తే శాంతి భద్రతల సమస్యలను గణనీయంగా తగ్గించుకునేందుకు పోలీసు యంత్రాంగంపై ఒత్తిడి సాధ్యమైనంత వరకు తక్కువ చేసేందుకు ఈ ఏకగ్రీవ ఎన్నికలు ఉపకరిస్తాయి. దాదాపు 20 నుంచి 30% గ్రామపంచాయతీలు ఏకగ్రీవాలు అవుతాయని అంచనా వేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. 26 జిల్లాల్లో పంచాయతీలకు తొలి విడత ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఇక ఏకగ్రీవాలకు ఈ ప్రోత్సాహకాల ఉత్తర్వులు తెర తీయనున్నాయి.

సీఎం చంద్రబాబుపై మండిపడ్డ వైఎస్ షర్మిల

మొదటిపేజీ తరువాయి - ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో ఈ పథకం నిర్వీర్యమైపోయిందని, ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు.వైఎస్సార్ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పేదవాడి చదువుకు పండుగలా ఉండేదని గుర్తుచేశారు. నేడు చంద్రబాబు పాలనలో అదే పథకం వేల కోట్ల బకాయిలతో చదువంటేనే దండుగగా మారిపోయిందని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఈ పథకం బకాయిలు రూ.6,400 కోట్లు దాటిపోయాయని, అందులో గత మూడేళ్లలోనే రూ.6,000 కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయని ఆమె తెలిపారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని షర్మిల దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అన్ని బకాయిలు క్లియర్ చేస్తామని, నేరుగా కాలేజీల ఖాతాల్లోకి నిధులు జమ చేస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? అని ఆమె నిలదీశారు. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలు దక్కక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఒకవైపు రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని భారీ ప్రచారాలు చేసుకుంటూ, మరోవైపు పేద విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పెంచుకుంటూ పోవడం సరికాదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కొండెక్కిన కోడిగుడ్డు ధర

మొదటిపేజీ తరువాయి - కొద్ది రోజులుగా క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. హోల్‌సేల్ మార్కెట్లో డజన్ గుడ్ల ధర గతంలో రూ.80 ఉండగా, నాలుగైదు రోజుల క్రితం రూ.90కి చేరింది. ప్రస్తుతం ఆ ధర ఏకంగా రూ.96కు చేరుకుంది. స్వల్ప వ్యవధిలోనే డజన్‌పై రూ.16 మేర ధర పెరగడంతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు.హోల్‌సేల్ ధరలకు అనుగుణంగా రిటైల్ మార్కెట్లోనూ ధరలు ఒక్కసారిగా పుంజుకున్నాయి. గతంలో చిల్లర దుకాణాల్లో రూ.6 నుంచి రూ.7 మధ్య పలికిన ఒక్కో కోడిగుడ్డు ధర, ప్రస్తుతం రూ.7.50 నుంచి రూ.8 వరకు పలుకుతోంది. ఆగస్టు మొదటి వారంలో తగ్గిన గుడ్డు ధర.. డజన్ రూ.80 వద్దే దాదాపు వారం క్రితం వరకు స్థిరంగా కొనసాగింది. అయితే గత కొద్ది రోజులుగా డిమాండ్‌కు తగిన సరఫరా లేకపోవడం వంటి మార్కెట్ పరిస్థితుల నేపథ్యంలో ధరలు వేగంగా పెరిగాయి.నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ సూచించిన హోల్‌సేల్ ధరల ప్రకారం.. నవంబర్ 13 నాటికి హైదరాబాద్‌లో 100 గుడ్ల ధర రూ.640గా ఉండగా, విశాఖపట్నంలో రూ.625 వద్ద నమోదైంది. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరల భారంతో సతమతమవుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రధాన పోషకాహార వనరుగా ఉండే కోడిగుడ్డు ధరలు కూడా పెరగడం మరింత భారంగా మారుతోంది. మార్కెట్లో ధరలు ఇంకా పెరుగుతాయా? లేక దిగివస్తాయా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

అసోం రోడ్డు ప్రమాదంలో 23 మంది దుర్మరణం

మొదటిపేజీ తరువాయి - అసోంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కజిరంగా సమీపంలోని జాతీయ రహదారిపై ప్రయాణికులతో వెళుతున్న మినీ బస్సు, కంటైనర్ ట్రక్కు ముఖాముఖి ఢీకొన్న ఘోర ప్రమాదంలో కనీసం 23 మంది దుర్మరణం పాలయ్యారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నట్లు సమాచారం అందుతోంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొకాఖాట్ నుంచి నాగావ్ వైపు వెళుతున్న మినీ బస్సు (ట్రావెలర్) కజిరంగా కోహోరా పరిధిలోని హథీకూలి టీ ఎస్టేట్ సమీపంలో గల రంగాజన్ వద్ద జాతీయ రహదారి 715పై ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఎదురుగా వేగంగా వస్తున్న కంటైనర్ ట్రక్కును మినీ బస్సు బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు మినీ బస్సు పూర్తిగా నుజ్జునుజ్జయి ప్రయాణికులు లోపలే ఇరుక్కుపోయారు.సమాచారం అందుకున్న వెంటనే స్థానిక ప్రజలు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. ప్రమాదం జరిగిన సమయంలో వాహనం నుంచి మృతదేహాలను వెలికితీసేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. తొలుత ఏడుగురు మరణించినట్లు సమాచారం వచ్చినప్పటికీ, సహాయక చర్యలు ముమ్మరం చేసే కొద్దీ మృతుల సంఖ్య 23కు చేరింది.ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో సుమారు 27 నుంచి 35 మందికి పైగా ప్రయాణికులు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది కళాశాల విద్యార్థినులతో పాటు కజిరంగా హైస్కూల్ విద్యార్థులు ఉన్నట్లు తెలుస్తోంది. గాయపడిన పలువురిని వెంటనే స్థానిక కోహోరా మోడల్ ఆసుపత్రికి తరలించారు. వారిలో పరిస్థితి విషమంగా ఉన్న బాధితులను మెరుగైన వైద్యం కోసం జోర్హాట్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.నేషనల్ పార్క్ పరిసర ప్రాంతాల్లో నిర్దేశించిన వేగ పరిమితి నిబంధనలను ఉల్లంఘించి మినీ బస్సు మితిమీరిన వేగంతో వెళ్లడమే ఈ ఘోర ప్రమాదానికి కారణమని ప్రాథమిక దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. అతివ

తెలుగుపత్రిక అక్షర మేధస్సు

శనివారం 14 - 11 - 2026

ఓవర్‌లోడ్‌తో ఇసుక రవాణా

చేస్తున్న ఐదు లారీలు సీజ్

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు -- తాడిపత్రి రూరల్ పోలీసులు



అక్షర మేధస్సు నవంబర్ 13తాడిపత్రి ఎల్లనూరు వైపు నుంచి తాడిపత్రి పట్టణానికి నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో ఇసుకను రవాణా చేస్తున్న ఐదు లారీలను తాడిపత్రి రూరల్ పోలీసులు సీజ్ చేశారు. ఎల్లనూరు వైపు నుంచి తాడిపత్రి పట్టణం వైపు ఇసుక లోడుతో వస్తున్న లారీలను పోలీసులు తనిఖీ చేయగా, వాహనాల్లో నిర్ణీత పరిమితికి మించి ఇసుకను రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఐదు లారీలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అనంతరం తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం సీజ్ చేసిన లారీలను తాడిపత్రి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ)కు అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసులు వాహనదారులకు హెచ్చరిక జారీ చేశారు. వాహనాల సామర్థ్యానికి మించి సరుకులను రవాణా చేయడం చట్టవిరుద్ధమని, ఓవర్‌లోడ్ కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రతి వాహనదారుడు రవాణా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి అధిక లోడుతో వాహనాలను నడిపితే ఉపేక్షించేది లేదని, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తాడిపత్రి రూరల్ పోలీసులు స్పష్టం చేశారు.

బుక్కరాయసముద్రం సర్పంచ్ అభ్యర్థి హిమబిందుకు

టీడీపీ నాయకులు, కార్యకర్తల సంపూర్ణ మద్దతు

సర్పంచ్ ఎన్నికల బరిలో హిమబిందు.. సమావేశంలో టీడీపీ శ్రేణుల కీలక నిర్ణయం



అక్షర మేధస్సు నవంబర్ 13బుక్కరాయసముద్రం, బుక్కరాయసముద్రం గ్రామ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో స్థానిక రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న హిమబిందు (లక్ష్మీనారాయణ భార్య)కు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ మద్దతు ప్రకటించారు. బుక్కరాయసముద్రం లో సమావేశమైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో అభ్యర్థి ఎంపిక, పార్టీ శ్రేణుల మద్దతు వంటి అంశాలపై సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా హిమబిందు అభ్యర్థిత్వానికి మద్దతుగా నిలవాలని నాయకులు, కార్యకర్తలు నిర్ణయించినట్లు సమాచారం. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఒకే నిర్ణయానికి రావడం గ్రామ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం, అభ్యర్థికి మద్దతు వంటి అంశాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. బుక్కరాయసముద్రంలో జరిగిన ఈ సమావేశం ద్వారా హిమబిందుకు మద్దతు ప్రకటించినట్లు పార్టీ వర్గాలు స్పష్టం చేశాయి. రానున్న రోజుల్లో ఎన్నికల ప్రచారం ఏ విధంగా సాగుతుందో, గ్రామ ఓటర్లు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

తన గెలుపుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

చాందిని మసీద్ లో ముస్లిం, మైనార్టీలతో కలయిక

దువా చేసిన మేయర్ రమేష్ గౌడ్



అక్షర మేధస్సు నవంబర్ 13అనంతపురం, ప్రతినిధి స్థానిక సంస్థల ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థిగా తన గెలుపుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ అనంతపురం నగర మేయర్ రమేష్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం నగరంలోని మూడవ రోడ్డులో ఉన్న చాందిని మసీదులో ముస్లిం, మైనార్టీలతో కలిసి మేయర్ రమేష్ గౌడ్ దువా చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీలను అలింగనం చేసుకుని వారిని అభినందించారు. ఎన్నికల్లో వారు చేసిన సహకారానికి, విశ్వాసానికి కృతజ్ఞతలు తెలిపారు. అన్ని వర్గాల ప్రజల సహకారంతోనే గెలుపు సాధ్యమైందని మేయర్ రమేష్ గౌడ్ పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీలతో పాటు అన్ని సంఘాల వారు పార్టీకి అందించిన మద్దతును గుర్తుంచుకుంటానని తెలియజేశారు. భవిష్యత్తులో అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తానని, నగర అభివృద్ధికి అందరి సహకారం అవసరమని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, మాజీ కార్పొరేటర్లు ఇషాక్, అశోక్ రెడ్డి, ముస్లిం, మైనార్టీలు హిద్దు, షకీల్, సవిద్, జిలాన్, ఫయాజ్, ఆరిఫ్, కరీం, హేమంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటివైద్య శిబిరం



అక్షర మేధస్సు నవంబర్ 13 పామిడి స్థానిక పామిడి పట్టణంలోని వాసవి కళ్యాణ మండపం (అమ్మవారిశాల) నందు ఈనెల 15 వ తేదీ ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి వారిచే ఉచిత కంటి మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పామిడి లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ మరియు ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు తెలిపారు. బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి కంటివైద్య నిపుణులు కంటి చూపు మందగించిన వారిని పరీక్షించి అవసరమైతే అన్ని రకాల కంటి ఆపరేషన్లకు ఉచితంగా చేస్తారని పేర్కొన్నారు.శంకర కంటి ఆసుపత్రి వారు ప్రత్యేక బస్సుల్లో బెంగళూరుకు తీసుకెళ్లి ఆపరేషన్లు అనంతరం తిరిగి గమ్యస్థానాలకు చేరుస్తారని ఆయన తెలియజేశారు. కంటి వైద్య శిబిరానికి హాజరయ్యే వారు రెండు ఆధార్ కార్డు జిరాక్స్ రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకుని రావాలని తెలిపారు. ఉచిత కంటి మెగా వైద్య శిబిరాన్ని పామిడి మండల ప్రజలు మరియు పామిడి చుట్టూ ప్రక్కల ఉన్నటువంటి మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు విజ్ఞప్తి చేశారు.

బాలల ముఖాల్లో ఆనందం

బహుమతులతో సంబరాలు

బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారులకు ఆర్డీటీ సంస్థ కానుకలు



అక్షర మేధస్సు నవంబర్ 13 గుత్తి ప్రతినిధి ఆదినారాయణ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని గుత్తి మండలం ధర్మాపురం గ్రామంలో శుక్రవారం ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు బహుమతులు పంపిణీ చేశారు. బాలల దినోత్సవం వేళ చిన్నారులను ఉత్సాహపం చడంతోపాటు వారిలో ఆనందాన్ని నింపేందుకు సంస్థ ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు బహుమతులు అందజేయడంతో చిన్నారులు సంతోషంతో సందడి చేశారు. బాలలే దేశ భవిష్యత్తు అని, ప్రతి చిన్నారికి విద్యతోపాటు సమాన అవకాశాలు కల్పించినప్పుడే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. బాలల సంక్షేమం, వారి సంతోషం కోసం ఆర్డీటీ సంస్థ చేపడుతున్న కార్యక్రమాల పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

గ్రామ పంచాయతీ 2వ సాధారణ ఎన్నికలు

2026 మొదటి విడత ఎన్నికల షెడ్యూల్ విడుదల

15.11.2026 నుంచి 17.11.2026 వరకు నామినేషన్ల స్వీకరణ..

26.11.2026న పోలింగ్, ఓట్ల లెక్కింపు..

అనంతపురం జిల్లాలో మొదటి విడతలో 13 మండలాల్లో ఎన్నికలు..

కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ లోని కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం, కంబదూరు, సెట్టూరు, కుందుర్పి, రాయదుర్గం, డి.హీరేహాల్, బొమ్మనహాల్, కనేకల్, గుమ్మగట్ట, అనంతపురం రెవెన్యూ డివిజన్ లోని అనంతపురం రూరల్, ఆత్మకూరు, రాప్తాడు మండలాల్లో మొదటి విడతలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ.. జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్..



అక్షర మేధస్సు నవంబర్ 13అనంతపురం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామ పంచాయతీ 2వ సాధారణ ఎన్నికలు – 2026 మొదటి విడత ఎన్నికల షెడ్యూల్ ను విడుదల చేసింది. అనంతపురం జిల్లాలో మొదటి విడతలో 13 మండలాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ తెలిపారు. (ఎ) ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ (ఎన్నికల నిర్వహణ) నియమావళి, 2006లోని 6వ నియమం క్రింద రిటర్నింగు అధికారి ఫారము-1 లో ఎన్నికల నోటీసు జారీ చేయవలసిన తేది 15.11.2026 (ఈ తేది నుండి ఉదయము 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు(బి) సదరు నియమావళిలోని 5వ నియమం క్రింద రిటర్నింగు అధికారి వార్డు వారీగా గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాను ప్రదర్శించుట 15.11.2026..నామినేషన్ల స్వీకరణకు ఆఖరు తేది 17.11.2026 సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్ల పరిశీలన 18.11.2026 ఉదయం 8.00 గంటల నుండి తిరస్కరించబడిన నామినేషన్లపై అప్పీలేట్ అధికారి సంబంధిత రెవెన్యూ డివిజినల్ అధికారి వద్ద అప్పీలు చేసుకొను తేదీ 19.11.2026 సాయంత్రం 5.00 గంటల వరకు అప్పీలేట్ అధికారి ద్వారా అప్పీళ్ళ పరిష్కారం 20.11.2026 అభ్యర్థిత్వముల ఉపసంహరణకు ఆఖరు తేది 21.11.2026 మధ్యాహ్నం 3.00 గంటల వరకు.పోటీ చేయు అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ 21.11.2026 మధ్యాహ్నం 3.00 గంటల తరువాత పోలింగు తేదీ : 26.11.2026 ఉదయం 7.00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు ఓట్ల లెక్కింపు తేది 26.11.2026 (మధ్యాహ్నం 2.00 గంటల నుండి).. ఫలితాల ప్రకటన ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే.. (ఎ) ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం, 1994 లోని సెక్షను 14 (10) క్రింద ఉప సర్పంచు ఎన్నిక నిర్వహించు తేదీ ఫలితాలు ప్రకటించిన తేదీన..(బి) ఏదైనా కారణం రీత్యా ఫలితాలు ప్రకటించిన తేదీన ఉప సర్పంచు ఎన్నిక జరుగనియెడల, ఆ మరుసటి రోజున గ్రామ పంచాయతీకి సెలవు దినం అయినప్పటికీ, ఉప సర్పంచు ఎన్నిక తప్పనిసరిగా నిర్వహించవలెను.. 12. రీపోలింగ్ తేది 27.11.2026 (ఉదయం 7.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు ఓట్ల లెక్కింపు మధ్యాహ్నం 2.00 గంటల నుండి.ఫలితాల ప్రకటన ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే.. అనంతపురం జిల్లాలో మొదటి విడతలో గ్రామ పంచాయతీ ఎన్నికలు మొత్తం 13 మండలాల్లో జరగనున్నాయి. అందులో కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పరిధిలోని కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం, కంబదూరు, సెట్టూరు, కుందుర్పి మండలాలకు, రాయదుర్గం, డి.హీరేహాల్, బొమ్మనహాల్, కనేకల్, గుమ్మగట్ట మండలాలు, అనంతపురం రెవెన్యూ డివిజన్ లోని అనంతపురం రూరల్, ఆత్మకూరు, రాప్తాడు మండలాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టడం జరుగుతోంది.

జనాభా గణన సెన్సెస్- 2027 పై ఉద్యోగులకు శిక్షణ



అక్షర మేధస్సు నవంబర్ 13 అనంతపురం భారతదేశ జనాభా గణన- 2027 రెండవ విడత ప్రక్రియలో భాగంగా స్థానిక జేఎన్టీయూ లోని సివిల్ ఇంజనీరింగ్ విభాగం సభ మందిరంలో క్షేత్రస్థాయి శిక్షకులకు అవగాహన మరియు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాలోల, అనంతపురం, కళ్యాణ్ దుర్గం ఆర్డీవోలు ప్రేమ్ మంత్ కుమార్ వసంత బాబు ప్రధాన శిక్షకులు జి ఎల్ ఎన్ ప్రసాద్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాలోల మాట్లాడుతూ జనాభా గణన ఉద్యోగులు క్షేత్రస్థాయిలో నాణ్యమైన డేటా సేకరణ లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని జనాభా గణన లోని చట్టపరమైన అంశాలను ప్రజలకు ఓర్పు సహనంతో వివరించి వారిలో నెలకొన్న అనుమానాలను సందేహాలను నివృత్తి చేసి ఎలాంటి అపోహలకు తావివ్వకుండా ప్రభుత్వ కార్యక్రమం యొక్క ముఖ్య లక్ష్యాన్ని వివరించాలని డిఆర్ఓ సూచించారు. క్షేత్రస్థాయిలో మొబైల్ యాప్ వినియోగంపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని ప్రజల నుండి సమాచారం సేకరించే సమయంలో క్షేత్రస్థాయిలోని అధికారులు, ఎన్యుమారేటర్లు సూపర్వైజర్లుప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని తెలిపారు. ఈనెల 12 నుండి 18 వ తేదీ వరకు శిక్షణ తరగతులను ఉద్యోగులు సద్వినియోగం చేసుకుని జనాభా గణనలో గల వివిధ దశలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలని జనాభా గణన కొరకు సూచనల మాన్యువల్ ను జాగ్రత్తగా చదివి పూర్తిగా అర్థం చేసుకొని మొబైల్ యాప్ కు సంబంధించిన అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని డిఆర్ఓ సూచించారు.

అనంతరం ప్రధాన శిక్షకులు

జి ఎల్ ఎన్ ప్రసాద్ ఉద్యోగులకు శిక్షణలో భాగంగా అవగాహన కల్పిస్తూ కుటుంబంలోని వ్యక్తుల డేటా ఎలా సేకరించాలి? ఆ కుటుంబ సభ్యులతో అడగాల్సిన ప్రశ్నావళి అంశాల తీరు విధానాలు అలాగే సామాజిక మరియు మతం మరియు కులం వివరాల నమోదు చేసే పద్ధతి, విద్యార్హతలు అక్షరాస్యతా నమోదు చేసే విధానం డేటా నాణ్యత మొబైల్ యాప్ ద్వారా ఎలా కుటుంబం మరియు వ్యక్తుల వివరాల నమోదు ప్రక్రియ స్వీయ నమోదు తదితర అంశాలపై బోధిస్తూ అవగాహన కల్పించారు.

పెళ్లికి ముందు యువత స్వచ్ఛందంగా హెచ్.ఐ.వీ. పరీక్షలు చేయించుకోవాలి

ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభావిత ప్రాంతాల్లో పరీక్షల సంఖ్యను పెంచాలి

జిల్లాలో ఎక్కడా రక్తపు కొరత తలెత్తకుండా బ్లడ్ బ్యాంకులు అప్రమత్తంగా ఉండాలి

శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



అక్షర మేధస్సు నవంబర్ 13 పుట్టపర్తి, వివాహ బంధంలోకి అడుగుపెట్టే ముందు యువతీ యువకులు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి హెచ్.ఐ.వి నిర్ధారణ పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అధ్యక్షతన జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లాలో హెచ్.ఐ.వి నియంత్రణ చర్యలు, రక్తనిధి కేంద్రాల పనితీరుపై ఆయన సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పెళ్లికి ముందు హెచ్.ఐ.వి. పరీక్షలు చేయించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై యువతలో విస్తృత అవగాహన కల్పించాలి. ఇందుకోసం ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, ఆకర్షణీయమైన గోడ పత్రికలను రూపొందించి ప్రజల్లోకి తీసుకెళ్లాలి. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలోనూ, అలాగే హెచ్.ఐ.వి. ప్రభావిత ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థల సహకారంతో పరీక్షలను మరింత ముమ్మరం చేయాలి. ఇప్పటివరకు గుర్తించని బాధితులను పరీక్షల ద్వారా గుర్తించి, పాజిటివ్‌గా నిర్ధారణ అయిన ప్రతి ఒక్కరికీ వెంటనే మెరుగైన చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలి.సుఖవ్యాధి చికిత్సా కేంద్రాల పనితీరు మరింత మెరుగుపడాలి. ఈ కేంద్రాలకు చికిత్స నిమిత్తం వచ్చే ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా హెచ్.ఐ.వి. పరీక్షలు నిర్వహించాలి.జిల్లాలోని రక్తనిధి కేంద్రాలు (బ్లడ్ బ్యాంకులు) అవసరమైన మేరకు రక్తనిల్వలను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలి. జిల్లాలో ఎక్కడా రక్తం కొరత అనే మాట వినిపించకూడదు. ఇందుకోసం ప్రతి రక్తనిధి కేంద్రం తరచుగా స్వచ్ఛంద రక్తదాన శిబిరాలను,రక్త నిర్ధారణ క్యాంపులను నిర్వహించాలి.ఐసిడిఎస్, పరిశ్రమల శాఖ, కార్మిక శాఖ మరియు వైద్య ఆరోగ్య శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, కార్మికులు మరియు అవసరమైన వర్గాలందరికీ హెచ్.ఐ.వి. పరీక్షలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించాలి. అంతకు ముందు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ జిల్లాలో అమలవుతున్న హెచ్.ఐ.వి నియంత్రణ కార్యక్రమాల ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ కు వివరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ ప్రమీల, పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ ప్రణయ్,జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకటరత్నం, సూపర్‌వైజర్ జీ.వి. రమణ, హిందూపురం బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి డా. లక్ష్మీ ప్రసాద్, బత్తలపల్లి ఏ.ఆర్.టి. కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హిమచంద్ర పాల్గొన్నారు. వీరితో పాటు సిబ్బంది ఈ.వి. రమణ, నారాయణ స్వామి, డీఆర్‌పీ రమేష్ మరియు ఫోర్ట్, చైతన్య, జనజాగృతి, దిశ, శక్తి మైత్రి మహిళా సంఘం ప్రివెన్షన్ యూనిట్ల ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.

303 ఒప్పందాలు, రూ.9.89 లక్షల కోట్ల పెట్టుబడులు – ఘనంగా ముగిసిన సీఐఐ సదస్సు

విశాఖ సీఐఐ సదస్సులో మొత్తం రూ.9.89 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు ఎంఓయూలు కుదిరాయని సీఎం ప్రకటించారు. వీటి ద్వారా 3.48లక్షల ఉద్యోగావకాశాలు లభించనున్నట్లు వెల్లడించారు.



విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సులో రెండు రోజుల్లో మొత్తం 9 లక్షల 89వేల కోట్ల రూపాయల విలువైన పెట్టుబడులకు ఎంఓయూలు కుదిరాయని సీఎం చంద్రబాబు ప్రకటించారు. వీటి ద్వారా 3లక్షల 48 వేల 309 ఉద్యోగ అవకాశాలు లభించనున్నట్లు వెల్లడించారు. 2024 జూన్ నుంచి మొత్తం ఎంఓయూల విలువ 32.49 లక్షల కోట్లకు చేరిందన్న ఆయన దేశ చరిత్రలోనే ఇది రికార్డు అని పేర్కొన్నారు. కాగా ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, కేంద్రమంత్రులు ప్రహ్లాద్ జోషి, రామ్మోహన్ నాయుడు, పలువురు రాష్ట్ర మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఓయూల వివరాలను చంద్రబాబు వెల్లడించారు. విశాఖ పెట్టుబడుల సదస్సు ద్వారా రాష్ట్రానికి రూ.9.02 లక్షల కోట్ల పెట్టుబడులతో పాటు 2 లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాలు వస్తాయని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ప్రాంతీయ సదస్సులు, ప్రధాన సమ్మిట్ కలిపి మొత్తం 303 ఒప్పందాలు కుదిరాయని తెలిపారు. వీటి ద్వారా రూ.9.89 లక్షల కోట్ల పెట్టుబడులు, 3.48 లక్షల ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. 2024 జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రానికి వచ్చిన మొత్తం పెట్టుబడి ప్రతిపాదనలు రూ.32.49 లక్షల కోట్లకు చేరాయని వివరించారు. వీటిలో 526 ప్రాజెక్టులకు భూమి, ప్రోత్సాహకాల ఆమోదం ఇచ్చామని రూ.17.10 లక్షల కోట్ల పెట్టుబడులతో 12.9 లక్షల ఉద్యోగాలకు అవకాశం ఏర్పడిందన్నారు. మరో 303 ప్రాజెక్టులు నిర్మాణ దశకు చేరుకున్నాయని వీటి ద్వారా రూ.7.30 లక్షల కోట్ల పెట్టుబడులు, 7.7 లక్షల ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయని సీఎం తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు 5 దేశాలు, దేశంలోని 6 నగరాల్లో 11 రోడ్‌షోలు నిర్వహించామని గుర్తు చేశారు. రాష్ట్రంలోని ప్రాంతీయ ప్రత్యేకతలకు అనుగుణంగా ఏఐ, డేటా సెంటర్లు, క్వాంటమ్, రక్షణ, ఎలక్ట్రానిక్స్, సముద్రాధారిత పరిశ్రమలపై దృష్టి సారించామన్నారు. కియా సంస్థ పెనుకొండ ప్లాంటు ఉత్పత్తి సామర్థ్యాన్ని మరో 2 లక్షల వాహనాలకు పెంచేందుకు రూ.18,878 కోట్లు పెట్టుబడి పెట్టనుందని, దీనివల్ల 12 వేల ఉద్యోగాలు కలగనున్నాయని చంద్రబాబు వెల్లడించారు.

ఎంఓయూల అమలుపై పూర్తి పారదర్శకత :

పెట్టుబడుల ఒప్పందాలు కాగితాలకే పరిమితం కాకుండా ఎంతవరకు కార్యరూపం దాల్చాయో ఏటా ఆడిట్ రిపోర్టు ద్వారా వెల్లడిస్తామని సీఎం ప్రకటించారు. ఎంఓయూల అమలుపై పూర్తి పారదర్శకత పాటిస్తామని స్పష్టం చేశారు. ఎంఎస్ఎంఈలను భారీ పరిశ్రమలకు అనుసంధానించి చిన్న పరిశ్రమలకు మరిన్ని అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. వ్యవసాయమే తమకు ప్రాధాన్యమని, అగ్రి ప్రాసెసింగ్ రంగాన్ని పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. రైతులకు మరింత మేలు చేసేందుకు ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. వ్యవసాయాన్ని మరిచిపోవడం అంటే మన సంస్కృతిని నిర్లక్ష్యం చేయడమేనని చంద్రబాబు వ్యాఖ్యానించారు. మొండలేజ్ సంస్థతో కలిసి కోకో మిషన్ ఏర్పాటు చేస్తున్నామని, అరకు కాఫీ ఉత్పత్తి పెంపుతో పాటు అంతర్జాతీయంగా దాని బ్రాండ్‌ను ప్రమోట్ చేసేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నామని వివరించారు. గతంలో ఎంఓయూలు పేపర్లకే పరిమితమయ్యేవని, ఇప్పుడు ప్రతి ఒప్పందాన్ని ట్రాక్ చేస్తూ పెట్టుబడులు వాస్తవరూపం దాల్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత రెండేళ్లలో ప్రభుత్వ విధానాలతో పారిశ్రామికాభివృద్ధిలో గణనీయమైన మార్పు వచ్చిందని, 25 సెక్టోరల్ పార్కులు ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా అడుగులు వేస్తున్నామని, సెల్ఫ్ సర్టిఫికేషన్‌తోనే ప్రక్రియ ప్రారంభించేలా సంస్కరణలు తీసుకొచ్చామని చెప్పారు. పెట్టుబడిదారులకు రక్షణ కల్పించేందుకు ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకొస్తున్నామని, కేంద్రం ఆమోదానికి పంపుతామని తెలిపారు. ఎస్క్రో ఖాతా విధానం కూడా అమల్లోకి వచ్చిందన్నారు. అంతరిక్షం నుంచి విద్యుత్ ఉత్పత్తి, ఉపగ్రహాల్లో డేటా సెంటర్ల ఏర్పాటుపైనా అధ్యయనాలు జరుగుతున్నాయని టెక్నాలజీని అర్థం చేసుకోలేకపోతే ఎగతాళి చేయకుండా నేర్చుకోవాలని చంద్రబాబు సూచించారు.

ప్రతి జిల్లాకి సాగునీరు :

రోడ్డు, రైలు, విమాన, జల మార్గాల అనుసంధానాన్ని పెంచి లాజిస్టిక్స్ రంగాన్ని అభివృద్ధి చేస్తామని సీఎం అన్నారు. పోలవరం నిర్మాణం, నదుల అనుసంధానం, రూ.35 వేల కోట్లతో 36 సాగునీటి ప్రాజెక్టుల పూర్తి ప్రభుత్వ ప్రాధాన్యతలని చెప్పారు. ప్రతి జిల్లాలోని ప్రతి ప్రాంతానికి సాగునీరు అందేలా కార్యాచరణ రూపొందించామన్నారు. స్కిల్ సెన్సస్ ద్వారా యువతలోని నైపుణ్యాలను గుర్తించి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇస్తామని తెలిపారు. యూనివర్సిటీల నుంచి ఐటీఐలు, పాలిటెక్నిక్‌ల వరకు అనుసంధానిస్తామని చెప్పారు. ఎంఎస్ఎంఈలకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ప్రోత్సాహం అందిస్తామని, కామన్ ఫెసిలిటీ సెంటర్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ద్వాక్రా ఉత్పత్తులకు స్వయం బ్రాండ్ తీసుకొచ్చామని, భూములు తీసుకుని పరిశ్రమలు స్థాపించని సంస్థలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతిని క్వాంటం కంప్యూటర్ల తయారీ కేంద్రంగా తీర్చిదిద్ది, ఇక్కడ తయారైన కంప్యూటర్లను విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి తీసుకెళ్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. క్వాంటం కంప్యూటర్ల తయారీకి ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహం అందిస్తోందని త్వరలోనే మేడిన్ అమరావతి క్వాంటం కంప్యూటర్లు ప్రపంచ మార్కెట్‌లోకి వెళ్లనున్నాయని తెలిపారు. విశాఖకు వచ్చే ప్రతిఒక్కరూ సంతృప్తి చెందుతున్నారని, మహిళల భద్రతలో నగరం అగ్రస్థానంలో ఉందని చెప్పారు. ఐటీ, పర్యాటక రంగాల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని, విశాఖ నుంచి వివిధ దేశాలకు సబ్‌సీ కేబుళ్లు ఏర్పాటు

అమరావతి ఓఆర్ఆర్‌లో కీలక పరిణామం రెండు ప్యాకేజీలుగానే నిర్మాణం

అమరావతి అవుటర్ రింగ్ రోడ్ ప్రాజెక్ట్‌ను నాలుగు ప్యాకేజీలుగా నిర్మించేలా ఇప్పటికే టెండర్లు పిలవగా, దాని స్థానంలో రెండు ప్యాకేజీల్లో నిర్మించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది.రాజధాని అమరావతి అవుటర్ రింగ్ రోడ్ ప్రాజెక్ట్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. దీనిని నాలుగు ప్యాకేజీలుగా నిర్మించేలా ఇప్పటికే టెండర్లు పిలవగా, దాని స్థానంలో రెండు ప్యాకేజీల్లో నిర్మించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. తాజాగా ఇచ్చిన క్లియరెన్స్‌తో అధికారులు టెండర్లలో మార్పులు చేయనున్నారు.రాజధాని అమరావతితోపాటు, విజయవాడ, గుంటూరు నగరాల చుట్టూ నిర్మిస్తున్న అవుటర్ రింగ్‌రోడ్డును నాలుగు ప్యాకేజీల నుంచి రెండు ప్యాకేజీలుగా నిర్మించాలని కేంద్రం నిర్ణయించింది. ఈమేరకు ప్రాజెక్టుకు కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య మదింపు కమిటీ ఆమోదం తెలిపింది. అయితే ఆరు వరుసల యాక్సెస్ కంట్రోల్‌తో కూడిన 189.93 కిలోమీటర్ల అమరావతి నారాకోడూరు సమీపం నుంచి గుంటూరు శివారు బుడంపాడు వరకు 5.2 కిలోమీటర్ల మేర నాలుగు వరుసలతో అనుసంధాన రహదారి కలిపి మొత్తం 195.13 కిలోమీటర్లకు అక్టోబర్ 2న టెండర్లు పిలిచింది. ప్రాజెక్ట్‌ను 4ప్యాకేజీలుగా



విభజించి బిడ్లు ఆహ్వానించింది. ఇప్పుడు మొత్తం ప్రాజెక్ట్‌ను రెండు ప్యాకేజీలుగానే నిర్మించేలా టెండర్లలో మార్పులు చేయనున్నారు.కంచికచర్ల వద్ద మొదలు : మచిలీపట్నం–విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిలో ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల వద్ద అమరావతి మొదలవుతుంది. అక్కడి నుంచి కృష్ణా జిల్లా కంకిపాడు మండలం చలివేంద్రపాలెం సమీపంలో 65ను మళ్లీ క్రాస్ చేస్తుంది. అక్కడ వరకు 86 కిలోమీటర్లు ఉంటుంది. ఇదంతా ఒక ప్యాకేజీగా ఉండనుంది. మిగిలిన 109.13 కిలోమీటర్లు మరో ప్యాకేజీగా ఉంటుంది. రెండో ప్యాకేజీలోనే కృష్ణా నదిపై రెండుచోట్ల కీలక వంతెనలు రానున్నాయి. ఇప్పటికే నాలుగు ప్యాకేజీలుగా పిలిచిన టెండర్లకు గడువు ఈనెల 18తో ముగియనుంది. తాజా పరిణామంతో టెండర్ల గడువు పెంచడంతోపాటు, నాలుగు ప్యాకేజీలకు బదులు, రెండు ప్యాకేజీలుగా సవరిస్తూ టెండరు నోటిఫికేషన్‌లో మార్పు చేయనున్నారు.దీూ పద్ధతిలో నిర్మాణం : అమరావతి నిర్మాణాన్ని ఇప్పటి వరకు హైబ్రీడ్ యాన్యుటీ మోడ్–హ్యామ్ విధానంలో నిర్మించాలని భావించారు. కానీ ఇప్పుడు దీూ పద్ధతిలో చేపట్టనున్నారు. ఒక్కో ప్యాకేజీ దక్కించుకున్న గుత్తేదారు సంస్థ సొంత నిధులతో ను నిర్మించి నిర్దిష్ట కాలపరిమితి వరకు నిర్వహించాల్సి ఉంటుంది. ఇలా 15 నుంచి 20 ఏళ్ల వరకు టోల్ వసూలు చేసుకొని, తీసుకుంటుంది.ఆ తర్వాత ప్రాజెక్ట్‌ను కు అప్పగిస్తుంది. అయితే విధానంలో రెండు రకాలు ఉంటాయి. టోల్ వసూలు ద్వారా మాత్రమే గుత్తేదారు వెచ్చించిన మొత్తం రాబట్టుకోవడం, ఒకవేళ నిర్దేశిత మొత్తం టోల్ ద్వారా వసూలు కాకపోతే అందులో తగ్గిన మొత్తాన్ని కేంద్రం ఏటా గుత్తేదారుకు చెల్లించడం వంటివి ఉంటాయి. ఇందులో ఏది అమలు చేయాలనేది కేంద్ర కేబినెట్ నిర్ణయిస్తుంది. ఇది కూడా పూర్తయితే ఓవైపు భూసేకరణ, మరోవైపు టెండర్ల ప్రక్రియ వేగంగా జరిగేందుకు వీలుంటుంది.

మేనకోడలి పెళ్లి చెడకొట్టేందుకు పన్నాగం 6 సెల్‌ఫోన్లతో వరుడికి మెసేజ్‌లు

మేనకోడలి వివాహాన్ని చెడకొట్టేందుకు ఒక యువకుడు దారుణానికి తెగబడ్డాడు. 6 మొబైల్ ఫోన్‌లను మార్చి పెళ్లికుమారుడికి పెళ్లి కుమార్తె గురించి తప్పుడు సందేశాలు పంపాడు మేనకోడలి వివాహాన్ని చెడకొట్టేందుకు ఒక యువకుడు దారుణానికి తెగబడ్డాడు. అతను ఆరు మొబైల్ ఫోన్‌లను మార్చి పెళ్లికుమారుడికి ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌ల ద్వారా పెళ్లి కుమార్తె గురించి తప్పుడు సందేశాలు పంపాడు. దీనిపై సైబర్ క్రైం పోలీసులు రంగంలోకి దిగారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టి మూడు నెలల పాటు నిందితుడి కోసం గాలించారు. నాలుగు జిల్లాల్లో తనిఖీలు చేసి, ఎట్టకేలకు నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఎంతటి సాంకేతిక పరిజ్ఞానం, ఎన్ని తెలివితేటలున్నా చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరని ఈ కేసు ఒక ఉదాహరణ అని పోలీసులు వెల్లడించారు.విజయవాడకు చెందిన ఒక యువతికి వివాహం నిశ్చయమైంది. ఆ తర్వాత కొద్ది రోజులకు పెళ్లి కుమారుడి ఫోన్‌కి యువతి గురించి తప్పుడు సందేశాలు వచ్చాయి. దీనిపై యువతి కుటుంబసభ్యులు విజయవాడ సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టారు. కేసు దర్యాప్తు ప్రారంభించిన సైబర్ క్రైం పోలీసులు పెళ్లికుమారుడికి వచ్చిన సందేశాలు, వాటికి సంబంధించి మొబైల్ ఫోన్‌ల ఐఎంఈఐ నంబర్ల గురించి ఆరా తీశారు. మొత్తం 6 వేర్వేరు ఫోన్ల నుంచి మేసేజ్‌లు వచ్చినట్లు తెలుసుకుని వాటి యజమానుల గురించి ఆరా తీశారు.తీగ లాగితే డొంక కదిలింది: 6 సెల్‌ఫోన్లు వాడు తున్న యజమానులను పోలీసులు పిలిపించారు. వారు తణుకు, మచిలీపట్నం, కంకిపాడు, దాములూరు, విశాఖపట్నం ప్రాంతాలకు చెందిన వారు కావడంతో వారిని విచారించారు. అయితే ఆ ఆరుగురికి ఎలాంటి సంబంధం లేకపోవడంతో, పోలీసులు విచార ణను మరో కోణంలో ప్రారంభించారు. ఈ ఆరు మొబైల్ ఫోన్లు ఎక్కడ కొనుగోలు చేశారో ఆరా తీయగా, విజయవాడ ఎన్టీఆర్ కాంప్లెక్స్ పేరు వెలుగులోకి వచ్చింది. అక్కడ ఒకే దుకాణం నుంచి ఫోన్లు కొన్నట్లు గుర్తించి దుకాణదారుడిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు గుట్టు రట్టయింది.సిమ్‌లు కొనుగోలు చేసి: ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లో మొబైల్ ఫోన్‌లు, సిమ్ కార్డులు విక్రయించిన యువకుడి స్నేహితుడే ఈ నేరానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. యువకుడు తన మేనకోడలు వివాహం చెడకొట్టేందుకు నిర్ణయించుకుని పక్కాగా ప్లాన్ చేశాడు. ముందుగా 4 జీ మెయిల్స్



క్రియేట్ చేసుకుని, 5 సిమ్‌లు కొనుగోలు చేసి ఆ తర్వాత విశాఖ పట్నం నుంచి విజయవాడకు వచ్చాడు. ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లోని తన స్నేహితుడి వద్ద సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్‌ను తీసుకుని, దాని ద్వారా మేసేజ్‌లు పెట్టాడు. ఇలా ఒకదాని తరువాత మరొకటి చొప్పున మొత్తం 6 సెల్‌ఫోన్లను దీని కోసం ఉపయోగించాడు. పోలీసులు ఒక్కో లింక్‌ను విడతీసుకుంటూ చివరకు నిందితుడిని గుర్తించారు. అతనికి సహకరించిన స్నేహితుడిని అరెస్టు చేశారు.

హైదరాబాద్‌కు కొత్త బాస్ నగరానికి సుపరిచితుడైన మహేశ్ భగవత్ ప్రస్థానం మీకు తెలుసా

భాగ్యనగరానికి కొత్త కొత్వాల్ నియమితులయ్యారు. నగర సీపీ వీసీ సజ్జనార్‌ను బదిలీ చేసిన ప్రభుత్వం, ఆయన స్థానంలో మహేశ్ భగవత్‌ను హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా నియమించింది .హైదరాబాద్ నగరానికి కొత్త కొత్వాల్‌గా డాక్టర్ మహేశ్ మురళీధర్ భగవత్ నియమితులయ్యారు. నగర పోలీసింగ్‌పై మంచి అవగాహన, శాంతి భద్రతల పరిరక్షణలో సుదీర్ఘ అనుభవం, మానవ అక్రమ రవాణా నిరోధంలో అంతర్జాతీయ గుర్తింపు. ఇలాంటి ప్రత్యేకతలు కలిగిన 1995 బ్యాచ్ ఐపీఎస్ అధికారి ఇప్పుడు భాగ్యనగర పోలీస్ బాస్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. గతంలో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసింగ్‌లో కీలక బాధ్యతలు నిర్వహించిన మహేశ్ భగవత్, ఇప్పుడు నగర పోలీస్ వ్యవస్థకు నాయకత్వం వహించనున్నారు.

గతంలో నిర్వర్తించిన బాధ్యతలు

మహేశ్ భగవత్‌కు రాజధాని పోలీసింగ్‌పై విశేష అనుభవం ఉంది. గతంలో హైదరాబాద్ నగరంలోని వివిధ జోన్లలో డీసీపీగా పని చేశారు. సున్నితమైన సౌత్‌జోన్ బాధ్యతలు కూడా నిర్వహించారు. ఆదిలాబాద్, కడప, గుంటూరు, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఎస్పీగా పనిచేశారు. సైబరాబాద్‌లో డీసీపీగా, అంతర్గత భద్రత విభాగం ఐజీగా బాధ్యతలు నిర్వర్తించారు. 2016లో ఏర్పాటైన రాచకొండ కమిషనరేట్‌కు తొలి పోలీస్ కమిషనర్‌గా నియమితులై సుమారు ఆరున్నరేళ్ల పాటు సేవలందించారు. 2022లో సీఐడీ అదనపు డీజీగా బాధ్యతలు చేపట్టారు. ఈ సమయంలోనే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఈఐఆర్ వ్యవస్థలో తెలంగాణను భాగస్వామ్యం చేయడంలో కీలక పాత్ర పోషించారు. 2024 జులై 10 నుంచి రాష్ట్ర డీజీపీ లా అండ్ ఆర్డర్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.



ఇప్పుడు అత్యంత కీలకమైన హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది.

అక్రమ రవాణా నిరోధంలో కీలక పాత్ర

పోలీస్ అధికారిగా నేర నియంత్రణతో పాటు సామాజిక బాధ్యతలోనూ మహేశ్ భగవత్ తనదైన ముద్ర వేశారు. ముఖ్యంగా మానవ అక్రమ రవాణా నిరోధంలో ఆయన సేవలకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. 2004 నుంచి 2022 మధ్య 2 వేలకు పైగా మహిళలు, చిన్నారులను అక్రమ రవాణా ముఠాల చెర నుంచి రక్షించారు. సుమారు 200 వ్యభిచార కేంద్రాలను మూసివేయించారు. ఇటుక బట్టీలు, ప్రమాదకర పరిశ్రమల్లో పని చేస్తున్న సుమారు 7 వేల మంది బాల, వెట్టి కార్మికులకు విముక్తి కల్పించడంలో కీలకంగా వ్యవహరించారు.

పలు అవార్డులు సొంతం

ఆదిలాబాద్‌లో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టిన 'పోలీస్ మీకోసం' కార్యక్రమానికి 2004లో అమెరికా ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ చీఫ్స్ ఆఫ్ పోలీస్ నుంచి అవార్డు అందుకున్నారు. నల్గొండలో మానవ అక్రమ రవాణా బాధితుల రక్షణ, పునరావాసం కోసం చేపట్టిన 'ఆసరా' కార్యక్రమానికి 2006లో అంతర్జాతీయ అవార్డులు లభించాయి. 2017లో అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించిన 'ట్రాఫికింగ్ ఇన్ పర్సన్స్ రిపోర్ట్ హీరో' అవార్డును అందుకున్నారు. 2025లో డీవై పాటిల్ విద్యాపీఠ్ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. రాష్ట్రపతి గ్యాలంట్రీ పోలీస్ మెడల్, మెరిటోరియస్ సర్వీస్ మెడల్, విశిష్ట సేవా పతకం సహా పలు పురస్కారాలు ఆయన సేవలకు నిదర్శనం.

యువతకు ఆదర్శంగా

మరోవైపు సివిల్ సర్వీసెస్ అభ్యర్థులకు మార్గదర్శకుడిగానూ మహేశ్ భగవత్ ప్రత్యేక గుర్తింపు పొందారు. గత పదేళ్లలో ఆయన ఆధ్వర్యంలో ఇచ్చిన ఇంటర్వ్యూ శిక్షణతో రెండు వేల మందికి పైగా ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఇతర కేంద్ర సర్వీసులకు ఎంపికయ్యారు. ఇషితా కిషోర్, దొనూరు అనన్య రెడ్డి, హర్షిత గోయల్ వంటి యూపీఎస్సీ టాపర్లకు కూడా మార్గదర్శకత్వం అందించారు.మానవ అక్రమ రవాణా నిరోధంపై 8 పుస్తకాల రూపకల్పనలో భాగస్వాములయ్యారు. జాతీయ పోలీస్ అకాడమీతో పాటు వివిధ రాష్ట్రాల్లో పోలీస్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఒకవైపు నేరాల నియంత్రణ, మరోవైపు సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసింగ్‌లో మార్పులు, అలాగే బాధితుల రక్షణ, యువతకు మార్గదర్శనం. ఇలా విభిన్న రంగాల్లో అనుభవం ఉన్న మహేశ్ భగవత్‌కు ఇప్పుడు హైదరాబాద్ నగర పోలీస్ పగ్గాలు అప్పగించారు.

రూ.3.50 లక్షలకే ఇందిరమ్మ టవర్స్ ఫ్లాట్.. తెలంగాణ ప్రభుత్వం కీలక ప్రక్రియ

తెలంగాణలోని ఐదు ప్రధాన పట్టణాల్లో 2,400 ఇందిరమ్మ ఫ్లాట్ల నిర్మాణం

రూ.5 లక్షల ప్రభుత్వ సబ్సిడీతో కేవలం రూ.3.50 లక్షలకే 512 చదరపు అడుగుల ఫ్లాట్

డిసెంబర్ 5 వరకు మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం

వార్షిక ఆదాయం రూ.6 లక్షల లోపు ఉన్నవారికే దరఖాస్తు చేసుకునే అర్హత

లాటరీ పద్ధతి ద్వారా లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని హౌసింగ్ బోర్డు స్పష్టీకరణ

తెలంగాణ ప్రభుత్వం పట్టణ పేదలకు తీపి కబురు అందించింది. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) వెలుపల ఉన్న ఐదు ప్రధాన నగరాల్లో 'ఇందిరమ్మ ఇండ్లు టవర్స్' పథకం కింద మొదటి విడతలో 2,400 ఫ్లాట్ల నిర్మాణానికి తెలంగాణ హౌసింగ్ బోర్డు డిమాండ్ సర్వే నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పథకం ద్వారా ఒక్కో అర్హత కలిగిన కుటుంబానికి రూ.5 లక్షల సబ్సిడీతో పాటు ఉచితంగా స్థలాన్ని సమకూరుస్తున్నారు. లబ్ధిదారుడి వాటాగా కేవలం రూ.3.50 లక్షలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది.ఈ పథకం కింద నిజామాబాద్ (నాగారం – ఆర్‌జీకే కాలనీ), వరంగల్ (గొర్రెకుంట), హనుమకొండ (మడికొండ), నల్గొండ (మామిళ్లగూడ), మహబూబ్‌నగర్ (బండమీదిపల్లి)లలో ఒక్కో ప్రాంతంలో 480 చొప్పున ఫ్లాట్లను నిర్మించనున్నారు. 5 లేదా అంతకంటే ఎక్కువ అంతస్తుల్లో నిర్మించే ప్రతి ఫ్లాట్ రిజిస్ట్రబుల్ విస్తీర్ణం 512 చదరపు అడుగులుగా ఉంటుంది.కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షలకు మించని వారు, సంబంధిత మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎలాంటి సొంతిల్లు లేదా నివాస స్థలం లేని స్థానికులు మాత్రమే ఈ పథకానికి అర్హులు. లబ్ధిదారుడి వాటా అయిన రూ.3.50 లక్షలను నాలుగు విడతల్లో చెల్లించవచ్చు. తాత్కాలిక కేటాయింపు సమయంలో రూ.1 లక్ష, ఆర్సీసీ నిర్మాణం పూర్తయ్యాక రూ.1 లక్ష, ఫినిషింగ్ దశలో రూ.1 లక్ష, ఫ్లాట్ అప్పగించే సమయంలో మిగిలిన రూ.50 వేలు చెల్లించాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం బ్యాంక్ రుణాలు పొందే



వెసులుబాటు కూడా కల్పించారు. ఫ్లాట్ కేటాయించిన తర్వాత 10 ఏళ్ల వరకు దానిని విక్రయించడం కానీ, అద్దెకు ఇవ్వడం కానీ చేయకూడదు.అర్హత కలిగిన లబ్ధిదారులు రూ.100 దరఖాస్తు రుసుము, రూ.10,000 ఈఎండీ డిపాజిట్ చెల్లించి మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఫ్లాట్ రానివారికి ఈ ఈఎండీ మొత్తాన్ని వెనక్కి ఇచ్చేస్తారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం లక్కీ డ్రా (లాటరీ), క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా తుది కేటాయింపులు చేపడతారు. దరఖాస్తుల సమర్పణకు డిసెంబర్ 5, 2026 చివరి తేదీ. పూర్తి వివరాలు, సందేహాల కోసం హౌసింగ్ బోర్డు హెల్ప్‌లైన్ నంబర్ 040-24603572 లేదా అధికారిక వెబ్‌సైట్ ను సంప్రదించవచ్చు.

హైదరాబాద్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల కొరడా.. 7 కేఎఫ్‌సీ, 2 డొమినోస్ ఔట్‌లెట్ల లైసెన్సులు రద్దు!

తనిఖీల్లో అపరిశుభ్రత, బొద్దింకలు, ఎలుకల వ్యర్థాలు గుర్తింపు

వాడిన నూనెను శుద్ధి చేసేందుకు ప్రమాదకర రసాయనాల వినియోగం

స్విగ్గీ, జొమాటోల నుంచి ఈ ఔట్‌లెట్లను తొలగించాలని ఆదేశాలు

నగరవ్యాప్తంగా 26 ఔట్‌లెట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

హైదరాబాద్‌లోని పలు ప్రముఖ ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలపై 'తెలంగాణ స్టేట్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్' అధికారులు కొరడా ఝుళిపించారు. అపరిశుభ్రత, నాణ్యతా లోపాలు తీవ్రస్థాయిలో ఉన్నాయని తేల్చిన అధికారులు.. నగరంలోని ఏడు కేఎఫ్‌సీ, రెండు డొమినోస్ పిజ్జా ఔట్‌లెట్ల ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) లైసెన్సులను తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. నిన్న ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసులతో కూడిన 13 బృందాలు నగరవ్యాప్తంగా ఈ రెండు సంస్థలకు చెందిన 26 ఔట్‌లెట్లలో ఏకకాలంలో దాడులు నిర్వహించాయి.ఈ తనిఖీల్లో అధికారులు షాకింగ్ విషయాలను గుర్తించారు. వంటగదులు, స్టోరేజ్ ఏరియాల్లో బొద్దింకలు, ఈగలు విపరీతంగా ఉండటం, ఎలుకల వ్యర్థాలు, గడువు ముగిసిన ఆహార పదార్థాలు, గోడలపై ఫంగస్, జిడ్డు పట్టిన వంటసామగ్రి, పరికరాలు, దుర్వాసన వంటి పలు తీవ్రమైన లోపాలను కనుగొన్నారు. ముఖ్యంగా వాడిన వంట నూనెను మళ్లీ వినియోగించేందుకు దాన్ని శుద్ధి చేయడానికి 'సింథటిక్ మెగ్నీషియం సిలికేట్' అనే రసాయనాన్ని అక్రమంగా వాడుతున్నట్లు అధికారులు గుర్తించారు. తనిఖీల్లో భాగంగా సుమారు 52 కిలోల ఈ రసాయనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కల్తీ జరిగిందనే అనుమానంతో 20 ఆహార నమూనాలను



సేకరించి ల్యాబ్‌కు వంపారు. లైసెన్సులు రద్దయిన వాటిలో మదీనగూడ–మియాపూర్, సింధి కాలనీ, చార్మినార్, మూసారాంబాగ్, బంజారా హిల్స్, హైటెక్ సిటీలోని శిల్పకళా వేదిక, మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్‌లోని కేఎఫ్‌సీ శాఖలు ఉన్నాయి. అలాగే, కొండాపూర్‌లోని శరత్ సిటీ మాల్, మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్‌లోని డొమినోస్ ఔట్‌లెట్ల లైసెన్సులను కూడా సస్పెండ్ చేశారు. ఈ ఔట్‌లెట్లను తక్షణమే మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. లైసెన్సులు పునరుద్ధరించే వరకు ఈ తొమ్మిది ఔట్‌లెట్ల వివరాలను స్విగ్గీ, జొమాటో వంటి ఆన్‌లైన్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌ల నుంచి తొలగించాలని కూడా అధికారులు కోరనున్నారు.ఇవి కాకుండా, మరో ఎనిమిది ఔట్‌లెట్లకు (నాలుగు కేఎఫ్‌సీ, నాలుగు డొమినోస్) ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. తీవ్రమైన ఉల్లంఘనలకు పాల్పడిన మరో ఐదు ఔట్‌లెట్లకు షోకాజ్ నోటీసులు పంపి, జరిమానాలతో సహా తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు.

మృత్యువు రూపంలో దూసుకొచ్చిన లారీ రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం



బాపట్ల జిల్లాలో ముగ్గురు వ్యక్తులతో వెళ్తున్న మోటార్ సైకిల్ ముందున్న వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు.చెన్నై – కోల్‌కతా జాతీయ రహదారిపై గురవారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాద ఘటన బాపట్ల జిల్లా మార్టూరు మండలం ఇసుకదర్శి సమీపంలో చోటుచేసుకుంది.పోలీసులు హైవే సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం దొనకొండ మండలం ఒద్దిపాడుకు చెందిన శ్రీరామ్ పేతురు (26), పుల్లలచెరువు మండలం ఐ.టి. వరం గ్రామానికి చెందిన మందా సాల్మన్ (20), నెహేమియా అనే ముగ్గురు యువకులు ఒంగోలులో జరిగిన తమ బంధువుల శుభకార్యానికి హాజరయ్యారు. అక్కడి నుంచి తిరిగి ఒకే ద్విచక్ర వాహనంపై గుంటూరు బయలుదేరారు. అర్ధరాత్రి సుమారు 12:30 గంటల సమయంలో మార్టూరు మండలం ఇసుకదర్శి వద్ద కొత్తగా నిర్మిస్తున్న జొన్నతాళి ఫ్లైఓవర్ సమీపంలోని సర్వీస్ రోడ్డు డైవర్షన్ పాయింట్ వద్దకు వీరు చేరుకున్నారు. ఈ క్రమంలో ముందు వెళ్తున్న లారీని వీరి బైక్ అదుపుతప్పి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి.ప్రమాదాన్ని గమనించిన హైవే పెట్రోలింగ్ సిబ్బంది వెంటనే స్పందించి, 108 అంబులెన్స్ ద్వారా క్షతగాత్రులను మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే శ్రీరామ్ పేతురు, మందా సాల్మన్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడిన నెహేమియాకు ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం, మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై మార్టూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణలో గిగ్ వర్కర్ల భారీ ర్యాలీ.. హాజరుకానున్న రాహుల్ గాంధీ!

రేపు హైదరాబాద్‌లో గిగ్ వర్కర్ల భారీ ర్యాలీ

సామాజిక భద్రత, కార్మిక హక్కుల సాధన ప్రధాన డిమాండ్

నిరసన ప్రదర్శనకు హాజరుకావాలని రాహుల్ గాంధీకి ఆహ్వానం

శిల్పకళా వేదిక నుంచి హెచ్‌ఐసీసీ వరకు ర్యాలీ నిర్వహణకు ఏర్పాట్లు



సామాజిక భద్రత, కార్మిక హక్కులు, సంక్షేమ చర్యలను డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లు భారీ ర్యాలీకి పిలుపునిచ్చారు. రేపు ఈ మహా ప్రదర్శనను నిర్వహించనున్నట్లు 'తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్' (టీజీపీడబ్ల్యూయూ) ప్రకటించింది. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఆహ్వానించినట్లు యూనియన్ ప్రతినిధి షేక్ సలావుద్దీన్ తెలిపారు.ఈ ర్యాలీ శిల్పకళా వేదిక నుంచి ప్రారంభమై 'హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్' (హెచ్ఐసీసీ)/హైటెక్స్ ప్రాంతం వరకు కొనసాగనుంది. గిగ్ కార్మికుల పక్షాన, ముఖ్యంగా 2023లో జరిగిన భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ అందించిన మద్దతుకు యూనియన్ కృతజ్ఞతలు తెలిపింది. ఈ నేపథ్యంలోనే తమ పోరాటానికి సంఘీభావం తెలపాలని ఆయన్ను కోరినట్లు పేర్కొంది.తెలంగాణ ప్రభుత్వం ఇటీవలే ఆమోదించిన 'తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యాక్ట్–2026' నేపథ్యంలో ఈ ర్యాలీకి ప్రాధాన్యత ఏర్పడింది. ఈ కొత్త చట్టం ద్వారా గిగ్ కార్మికులందరినీ తప్పనిసరిగా నమోదు చేసుకోవడం, వారికి సామాజిక భద్రతా ప్రయోజనాలు కల్పించడం, ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం వంటి అంశాలకు చట్టపరమైన హామీ లభించింది.ప్రభుత్వం ఇప్పటికే ఈ చట్టం అమలు కోసం నియమాలను రూపొందించిందని, సంక్షేమ బోర్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోందని యూనియన్ తెలిపింది. అంతేకాకుండా, కార్మికుల నమోదు మరియు ఫిర్యాదుల స్వీకరణ కోసం ప్రత్యేకంగా ఒక యాప్‌ను కూడా ప్రారంభించిందని పేర్కొంది. ఈ నేపథ్యంలో, చట్టం ద్వారా లభించిన హక్కులను పూర్తిగా, మెరుగైన పద్ధతిలో అమలు చేయాలని కోరుతూ రవాణా, డెలివరీ, ఇతర డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో పనిచేస్తున్న కార్మికులు ఈ ర్యాలీ ద్వారా తమ గళాన్ని వినిపించనున్నారు.

మహిళా కమిషన్ ఎదుట హాజరైన మల్లారెడ్డి విద్యాసంస్థల వైస్ చైర్మన్ ప్రీతిరెడ్డి



మల్లారెడ్డి విద్యాసంస్థల వైస్ చైర్మన్, మాజీ మంత్రి మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదను కలిశారు. విద్యాసంస్థల ప్రాంగణాల్లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో మహిళా కమిషన్ లేవనెత్తిన సందేహాలు, ప్రశ్నలకు వివరణ ఇచ్చేందుకు ఆమె కమిషన్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా కమిషన్ అడిగిన పలు అంశాలపై ఆమె సుదీర్ఘంగా సమాధానాలు ఇచ్చారు.భేటీ అనంతరం ప్రీతిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. విద్యాసంస్థల వైస్ చైర్మన్ హోదాలో కమిషన్ అడిగిన అన్ని ప్రశ్నలకూ పూర్తిస్థాయిలో వివరణ ఇచ్చినట్లు తెలిపారు. కాలేజీలలో సినీ ఈవెంట్ల నిర్వహణపై వస్తున్న వార్తలపై ఆమె స్పష్టతనిచ్చారు. 365 రోజుల్లో తమకు చెందిన 3 వేర్వేరు క్యాంపస్‌లలో కేవలం 3 ఈవెంట్లను మాత్రమే నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమాల వల్ల విద్యార్థుల రోజువారీ తరగతులకు ఎలాంటి భంగం కలగలేదని ఆమె స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం, అలాగే ఇటీవల ఉన్నత విద్యామండలి జారీ చేసిన అన్ని రకాల మార్గదర్శకాలను, ఆదేశాలను తమ విద్యాసంస్థలు తు.చ. తప్పకుండా పాటిస్తాయని ప్రీతిరెడ్డి వెల్లడించారు. కాలేజీల్లో వేడుకలు లేదా కార్యక్రమాలు జరిగినప్పుడు యాజమాన్యం మాత్రమే కాకుండా, విద్యార్థులు కూడా తగినంత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. విద్యార్థుల భద్రత, వారి భవిష్యత్తుకు తమ విద్యాసంస్థలు ఎల్లప్పుడూ అత్యధిక ప్రాధాన్యత ఇస్తాయని ఆమె పేర్కొన్నారు.

హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్ వద్ద మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ధర్నా

వైసీపీ నేతలను బైండోవర్ కేసుల పేరుతో పోలీసులు వేధిస్తున్నారన్న వంశీ

**పోలీస్ స్టేషన్ ఎదు